# చిటికెడు చక్కెర

పారిపోవడం కోసం ప్రయత్నిస్తున్న నా చేతిని గట్టిగా పట్టుకుని తన వైపుకు లాగుతూ "నా పెళ్లాం కనిపించడం లేదు" అని సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు పిర్యాదు చేశాడతను.

చాలాసేపటి నుంచీ మౌనంగా ఉండిపోయాడేమో, బలవంతంగా నోరు తెరిచే సరికి అతడి గొంతు కీచుగా పలికింది. అతడి గుండెల్లోని బాధ అతడి మాటల్ని వణికిస్తున్నాయి.

సబ్‌ఇన్‌స్పెక్టర్ చివాలున తల పైకెత్తి, ఎదురుగా విషాదంలో ముడుచుకుపోయిన ముఖం కనిపించేసరికి చికాకు పడుతూ ఏదో అడగబోయి, మాటల్ని పొదుపు చేసుకోదలచుకుంటున్నట్టుగా, ఎదుటి కుర్చీకేసి చేయి చాపాడు.

నన్ను బలవంతంగా తన పక్కనున్న కుర్చీలోకి లాగుతూ "నా పెళ్లాం కనిపించడం లేదు సార్" అన్నాడతను మరోసారి, తన మాటల్ని తన ఏడుపు నుంచీ వేరు చేయడానికి ప్రయత్నిస్తూ.

సబ్ ఇన్‌స్పెక్టర్ నాకేసి ఉరిమి చూసి "నువ్వెందుకొచ్చావు? నీ కంప్లయింటేమిటి?" అని అడిగాడు, ఫిర్యాదు చేస్తున్న వ్యక్తి కంటే నేను తననెక్కువగా ఆకర్షిస్తున్నట్టుగా.

అతను బాధతో రొప్పుతూ "ఇతను కంప్లయింటివ్వడం కోసం రాలేదు సార్. ఒంటరిగా పోలీస్‌స్టేషనుకు రావడానికి భయపడి నేనే ఇతడ్ని బలవంతంగా తోడు తీసుకొచ్చాను" అన్నాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ విసుగ్గా పెదవి విరిచి "భయపడిన వాళ్లు పోలీస్‌స్టేషన్‌కు వస్తారు గానీ, పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడ్డమేమిటి విడ్డూరంగా!" అని కసిరాడు. ఇంతలో విషయమేదో స్ఫురించినట్టుగా "తప్పు చేసిన వాళ్లకు పోలీస్‌స్టేషనంటే భయమే మరి" అంటూ తలపంకించాడు.

"తప్పా? నేనా?... లేదులేద్సార్! నేను కంప్లయింటు యివ్వడానికే వస్తున్నానంతే. నా పెళ్లాం కనబడ్డంలేద్సార్..." బాయినెట్లలా గుచ్చుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ చూపుల నుంచీ తప్పించుకోవడం కోసం అతను తబ్బిబ్బు పడసాగాడు.

పోలీస్‌స్టేషన్నంతా కమ్ముకున్న ఫినాయిల్ వాసన కాసేపటి క్రితమే దాన్ని కడిగారని సాక్ష్యం చెబుతోంది. గోడపైన వేలాడుతున్న కేలండరు కాగితాలు పైకెగరకుండా సెలోఫిన్ టేపు నిరంతరాయంగా డ్యూటీ చేస్తోంది. గుమ్మానికెదురుగా గోడకు తగిలించిన పాత దేశనాయకుల ఫోటోల ముందు గడియారం టిక్కుటిక్కుమంటూ కవాతు చేస్తోంది.

సబ్ ఇన్‌స్పెక్టర్ సెల్ తలుపుల్ని తెరుస్తున్నట్టుగా ఫైలొకదాన్ని ఫెళఫెళా తిప్పి, కలాన్ని బెత్తంలా గట్టిగా పట్టుకుని "చెప్పు.... నీ భార్యెప్పుడు మాయమైంది? ఆ సంగతి నీకెప్పుడు తెలిసింది?" అని అడిగాడు.

అతను నా చేతిని మరింత గట్టిగా పట్టుకుని "నా భార్య మాయమైపోయిందని నేనెప్పుడు చెప్పాను సార్? కనిపించడం లేదనే గదా నేను కంప్లయింటిస్తున్నది!" అని కంగారు పడ్డాడు.

"కనిపించడం లేదా? ఎప్పటినుంచీ?" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ప్రశ్నను సవరించుకున్నాడు.

"మూడు రోజులుగా కనిపించడం లేదు సార్" అన్నాడతను దీనంగా, నా చేతిని తన చేతుల్లోంచీ సడలించకుండా.

"అయితే మూడ్రోజుల ముందే యెందుకు రిపోర్టివ్వలేదు?" సబ్ ఇన్‌స్పెక్టర్ విచారణ మొదలు పెట్టాడు.

"వెళ్లిన వ్యక్తి తిరిగి రాకుండా యెక్కడికి పోతుందిలే అని రెండు రోజులుగా వేచి చూశాను సార్. ఇక రాదేమోనన్న భయంతో ఇప్పుడు రిపోర్టిస్తున్నాను" అని గింజుకున్నాడతను.

"ఎందుకు రాదని అనుకుంటున్నావు? అలా అనుకోడానికి కారణమేమిటి?" సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంకా తన కలాన్ని కాగితంపైన మోపడానికి సందేహిస్తూనే ఉన్నాడు.

"మామూలుగా నాతో చెప్పకుండా ఎక్కడికీ పోదు. ఇప్పుడు రెండు రోజులుగా తిరిగి రాలేదు.... అందుకని... ఇక తిరిగిరాదేమోనని" అతను మాటల్ని పూర్తి చేయలేకపోయాడు.

"సరే చెప్పు. నీ అడ్రస్సేమిటి? నీ భార్య వయస్సెంత? పుట్టుమచ్చలేమిటి? పోలికలేమిటి? ఆమె ఏ వైపుకు వెళ్లిపోయి ఉంటుందని నీ అనుమానం?" సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశ్నల జాబితాను కుమ్మరించాడు.

"నేను నెంబరు 23, పద్మాడో క్రాసు, చిదంబరనగర్‌లో ఉంటున్నాను సార్. నా భార్య నాకంటే రెండు మూడేళ్లు చిన్నది సార్. అంత సన్నమూ కాదు, అలాగని అంత

లావూ కాదు. పొట్టీ గాదూ, అలాగని పొడుగూ కాదు. నా పెళ్లప్పుడు నా పక్కన నిలబడితే నా చెవుల వరకూ వచ్చేది. ఎప్పుడూ ఇంతింత మంద ముందే కళ్లద్దాలు వేసుకునే ఉంటుంది. అవి తీసేస్తే ఆమెకేమీ కనిపించదు, దూరానివైనా, దగ్గరివైనా..."

అతను కళ్లద్దాల సంగతి చెప్పేసరికి నేను ఉలిక్కిపడి, అతడు ఇదివరకు చెప్పిన పోలికలనంతా గుర్తు చేసుకోసాగాను.

"పుట్టుమచ్చల వివరాలు కావాలంటే ఆమె ఎస్సెస్సీ సర్టిఫికెట్టెక్కడుందో వెతకాల్సిందే సార్. నాకు గుర్తు లేవు. ఏ వైపుకు వెళ్లిందో నాకు తెలియదు" అన్నాడతను, రాసుకోవడం మానేసి తననే కళ్లార్పకుండా చూస్తున్న సబ్ ఇన్స్పెక్టర్నే మిర్రిమిర్రి చూస్తూ.

"ఏమిటేమిటి? పోలికలు మరోసారి చెప్పు" ఈసారి సబ్ ఇన్స్పెక్టర్ గొంతు కూడా ఎందుకో వణికింది. అతను అడుగుతుంటే నేను మాట్లాడుతున్నట్టే అనిపించింది.

రీప్లే చేసిన కాసెట్టులా అతను వల్లించిన ప్రతిమాటకూ నాతోబాటూ ఉలిక్కిపడుతూ వచ్చిన సబ్ ఇన్స్పెక్టర్, ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ, "ఈ వివరాలు చాలవు... ఇంకా చెప్పు" అన్నాడు.

అతను అయోమయంగా కనురెప్పలల్లార్చి, ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో విడదీసి, "నా భార్య జుట్టు పొడవూ కాదు, అలాగని పొట్టీ కాదు. ఇంట్లో ఉండేటప్పుడు నగలేమీ వేసుకోకుండా, గాబరా గాబరాగా ఉంటుంది. బయటికి వెళ్లేటప్పుడు మాత్రం ఒళ్లంతా నగలు దిగేసుకుని ముందు నాకు వడ్డించాక గానీ తాను అన్నం తినదు. నేను ఆఫీసుకెళ్లొస్తానని చెప్పినప్పుడు తలాడిస్తుంది. నేను పరధ్యానంగా చెప్పకుండా వెళ్లిపోయినా ఏమీ అనదు..." అని చెప్పుకుపోయాడు.

సబ్ ఇన్స్పెక్టర్ శబ్దమొచ్చేలా పెదవులు చప్పరించాడు. నిద్రలోంచీ మేలుకుంటున్నట్టుగా అతను ఉలిక్కి పడి, చెప్పడం ఆపాడు. నేను వాళ్లిద్దరినీ కలిపి చూడ్డానికి విఫల ప్రయత్నం చేయసాగాను.

సబ్ ఇన్స్పెక్టర్ తన ముఖాన్ని సున్నాలా ముడుచుకుని, "ఈ వివరాలు కాదు నాక్కావాల్సింది. పోలికలు.. ఆమెను గుర్తు పట్టగలిగే పోలికలు చెప్పు..." అని కసిరి అతను చెప్పబోయే వివరాల్ని జాగ్రత్తగా వినడం కోసం ముందుకు వంగాడు. నా చేతిని అతనెప్పుడు విడిచిపెట్టేశాడో నాకే తెలియదు. అయినా ఎవరో నన్నక్కడ కట్టి పడేసినట్టుగా, నేను కూడా కుందేలులా చెవుల్ని రిక్కించాను.

"నా భార్య ఎరుపు కాదు సార్. అలాగని నలుపూ కాదు. తెలుపసలే గాదు. ఇవన్నీ

కలిపితే వచ్చేరంగు కూడా కాదు. చూడగానే ఇది అని చెప్పే రంగే కాదు సార్ నా పెళ్లానిది. జడ అల్లుకోకపోయిన ఆమె జుట్టు భుజాలదాకే వస్తుంది సార్. చీరలే కడుతుంది. అయితే అప్పుడప్పుడు డ్రస్సులూ వేసుకుంటుంది. పండగలప్పుడు మాత్రం తప్పనిసరిగా పట్టుచీరలే కడుతుంది." వివరాలు గుర్తుచేసుకోవడం కోసం అతను బుర్రగోక్కోసాగాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ చివాలున నాకేసి తిరిగి, "ఈ మనిషి చెప్పిన పోలికలన్నీ కరెక్టేనా?" అని నన్ను నిలదీశాడు.

"ఏమో! ఆ సంగతి నేనెలా చెప్పగలను సార్?" అని నాన్చాను.

"అట్లా నట్లుగొడితే నేనొప్పుకోను. నీ స్నేహితుడి భార్య గురించి నీకేమీ తెలియదా?" అని గద్దించాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"స్నేహితుడా? కాదు కాదు.. అవును. అయినా వాళ్లింటికి వెళ్లేంత స్నేహం లేదు సార్. పరిచయం.. అంతే. ఒకే ఆఫీసులో పనిచేస్తున్నామంతే..." అన్నాను తడబడుతూ.

స్నేహం లేకపోతే కంప్లయింటిచ్చేందుకు తోడెందుకొచ్చావు?" అని విసుక్కున్నాడతను. తరువాత అతడ్ని ఉరిమి చూసి, "కంప్లయింటిచ్చేటప్పుడైనా కొంచెం బాగా తెలిసిన మనిషిని తోడు తెచ్చుకోవాలని తెలియదా నీకు?" అని గర్జించాడు.

అతను ఏడుపు మొహం పెట్టుకుని, "నా పెళ్లాం కనబడడం లేదు సార్. ఆ కంప్లయింటివ్వడం కోసం నాకు బాగా పరిచయస్తుడు దొరికేదాకా వేచి చూడమంటారా నన్ను? ఇది ఘోరం సార్... అన్యాయం..." అని అంగలార్చాడు.

అతన్ని స్నేహితుడని నేననుకోవడం లేదు. నన్నతను పరిచయస్తుడిగా కూడా భావించడం లేదు. అయినా నన్నిలా బలవంతంగా పోలీస్‌స్టేషనుకు లాక్కురావడమే కాకుండా, నా ముందే ఆ తప్పిపోయిన పెళ్లాం పోలికలను ఏకరువు పెడుతున్నాడు. ఇదంతా ఆషామాషీ వ్యవహారంలా లేదు. దీని వెనక పెద్ద తిరకాసేదో ఉంది. ఆ సంగతిని నేను పసిగట్టానన్న విషయం ఇతడికి తెలిసిపోయినట్టే ఉంది. ఇతగాడు గుండెలు తీసిన బంటే! సందేహం లేదు....

తాను ఫైల్లో రాసుకున్న వివరాలన్నీ దాదాపు కంఠస్థం చేసినట్టుగా సబ్ ఇన్‌స్పెక్టర్ తలూపి, పెద్దగా నిట్టూర్చి "నువ్వు ఈ మనిషితో పాటూ వాళ్లింటికెళ్లు... ఆ భార్య అనే మనిషి ఆ ఇంట్లోంచీ ఎలా పోయిందో వాకబు చెయ్యి. నాకు వెంటనే మా యింటికి వెళ్లాల్సిన పనిబడింది. ఇంకో గంటలో నేను వాళ్లింటికొచ్చేస్తాను..." అన్నాడు.

"ఇప్పటికే ఆలస్యమయ్యింది సార్. మీరింకో గంట ఆలస్యం చేయడం న్యాయం

కాదు.... సరాసరి మా ఇంటికే వెళ్దాం రండి సార్" అని ప్రాధేయపడ్డాడతను.

"నో నో..." సబ్ ఇన్‌స్పెక్టర్ పెద్దగా అరిచాడు. అతడికంత కోపమెందుకొచ్చిందో తెలియలేదు.

"పొద్దస్తమానమూ ఉద్యోగం తప్పితే మాకింకో బతుకు లేదా? మాకూ కొంపా గోడూ, పెండ్లాం గిండ్లాం ఉండరా?" అని గీపెట్టాడు సబ్ ఇన్‌స్పెక్టర్. తరువాత తన కోపాన్ని నావైపుకు మళ్లించి, "పోపో... ఈ మనిషిని ఒంటరిగా విడిచిపెట్టొద్దు. తరువాతేమైనా తారుమారయితే నిన్నే అరెస్టు చేస్తాను" అని తేల్చేశాడు.

"సార్.. సార్.. మరి" అతను ఇంకా ఏదో చెప్పబోతున్నా నేనతని చెయ్యి పట్టుకుని పోలీస్‌స్టేషను బయటకు లాక్కొచ్చేశాను. దూరంగా వచ్చాక, నా మోటరు బైకు పైకెక్కి "గంటలో మీ ఇంటికొస్తాను. ఈలోగా నాకూ మా ఇంట్లో కొంచెం పనుంది" అని చెప్పి, అతడి ముఖమైనా చూడకుండా ఆక్సిలేటర్ను వేగంగా తిప్పాను.

మా ఇంట్లోకెళ్తూనే "వినబడిందా?" అని కేకేశాను. పెళ్లాన్ని "వినబడిందా?" అని పిలవడం నాకు మా తాత ముత్తాల నుంచీ సంక్రమించిన ఆచారం. ఆమె నీళ్లగ్లాసుతో బాటూ వచ్చింది. ఆమె అంత పొడుగూ కాదు, అలాగని పొట్టీకాదు. ఎరుపూ కాదు, నలుపూ కాదు. ఆమె జుట్టు ఆమె భుజాల వరకే వస్తోంది. భూతద్దం కళ్లజోడులోంచీ నాకేసి మిర్రిమిర్రీ చూస్తోంది.

"కాఫీ... తె...." అని ఆమె సగం మాటను మాత్రమే పలికింది.

"అడిగితేగానీ తేవా?" అని గాండ్రించాను.

ఆమె మౌనంగా లోపలికెళ్లిపోయింది. నన్నంతవరకూ వేటాడిన అలజడి క్రమంగా తగ్గిపోసాగింది. ఆమె తీసుకొచ్చిన కాఫీ తాగుతూ నేను క్రమంగా ప్రశాంతతకు తిరిగొచ్చేశాను. మరేం పర్వాలేదు! ఆ మనిషి ఇచ్చిన కంప్లయింట్‌లో ఏ కిరికిరీ లేదు. నా భార్య ఖాళీ కప్పును తీసుకెళ్తుండగా నేను చిలిపిగా "ఐ లవ్ యూ" అన్నాను. ఆమె "ఛ్ఛెఛ్ఛెఛ్ఛీ" అని చిత్రంగా అరుస్తూ, ఒక్క సారిగా హాల్లోంచి లోపలికి ఎగిరి దూకి పారిపోయింది. నేను ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఇంటి బయటికొచ్చాను.

చిదంబరనగర్, పదమూడో క్రాసు, ఇరవై మూడో నెంబరు ఇంటి ముందు సబ్‌ఇన్‌స్పెక్టర్ వాహనమేదీ కనిపించలేదు.

కాలింగ్ బెల్ నొక్కగానే అతను వచ్చి తలుపు తీశాడు. నేనీసారి అతడికేసి నిజంగానే జాలిగా చూస్తూ "సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంకా రాలేదా?'" అని అడిగాను. అతను లేదన్నట్టుగా

తల అడ్డంగా ఊపాడు. నేను సోఫోలో కూర్చుంటూ "ఇలా ఆమె కనబడక పోవడం ఇదే మొదటిసారా? వాళ్ల పుట్టింటికి ఫోన్ చేశావా?" అని అడిగాను. అన్ని ప్రశ్నలకూ తల అడ్డంగా ఊపడమే అతడి సమాధానమైపోయింది.

ఆ ఇల్లు అప్పుడే కడిగిపెట్టిన స్టీలు గిన్నెలా శుభ్రంగా ఉంది. కిటికీలకూ, తలుపులకూ వేలాడుతున్న తెరలు కూడా నిశ్శబ్దంగా కదులుతున్నాయి.

"నాకు క్రమశిక్షణంటే ప్రాణమని నా భార్యకు బాగా తెలుసు. నేను కాలితో చెప్పేపని చేత్తో చేస్తూండేది" అంటూ అతను కనబడకుండా పోయిన భార్యను తలచుకుని విలవిల లాడిపోసాగాడు. "గంటలో వస్తానన్నాడు. రెండు గంటలయింది. ఇదేనా డ్యూటీ చేసే పద్ధతి?" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యానికి మరింతగా విచలితుడైపోసాగాడు.

కాస్సేపటి తర్వాత తాపీగా, అడుగులో అడుగేసుకుంటూ వచ్చిన సబ్‌ఇన్‌స్పెక్టర్ పెద్దగా నవ్వుతూ, "మా జీపు ఆగిన శబ్దం కూడా వినబడలేదా మీకు?" అన్నాడు. అతనెందుకో హుషారుగా, ఆనందంగా, ఉబ్బి తబ్బిబ్బయిపోతున్నాడని స్పష్టంగా తెలిసిపోతోంది. కొన్ని గంటల ముందు పోలీస్‌స్టేషనులో కనిపించిన వ్యక్తీ. ఇప్పుడు వచ్చిన మనిషీ ఒకరే ననిపించడం లేదు.

సోఫాలో జారగిలపడ్డాక, సబ్ ఇన్‌స్పెక్టర్ మరోసారి గల గలా నవ్వి "ఇంటికెళ్లి ఫ్రెషప్ అయి వస్తే గానీ నేను పనిపైన ధ్యాస పెట్టలేను.. నీకో తమాషా సంగతి చెప్పనా? నా భార్య కూడా పొడుగూ కాదు, అలాగని పొట్టీ కాదు. నలుపూ కాదు, అలాగని తెలుపూ కాదు. దాని జుట్టు కూడా దాని భుజాల వరకే ఉంటుంది. సోడాబుడ్డి కళ్లద్దాలు లేకపోతే దానికి పగలైనా రేయయినా ఒకటే" అన్నాడు. అంతలోనే ఉలిక్కిపడి, నాలుక కరుచుకుని "ఈ మనిషి అల్లాటప్పావాడు కాదు. అందుకే మామూల్లా కాకుండా, నేరుగా వీళ్లింటికే వచ్చి ఇన్‌స్పెక్ట్ చేస్తున్నాను" అన్నాడు నాతో.

ఇంతలో లోపలి నుంచీ ట్రే పట్టుకున్న స్త్రీ హాల్లోకి వచ్చింది. ఆవిడ అంత పొడుపూ కాదు, పొట్టీ కాదు. నలుపూ కాదు, తెలుపూ కాదు. ఆవిడ జుట్టు భుజాలను దాటడం లేదు. ఆవిడ సన్నగానూ లేదు, లావుగానూ లేదు. దళసరి కళ్లద్దాలలోంచీ ఆవిడ చూపులు ఎటు ప్రసరిస్తున్నాయో తెలియడం లేదు.

"ఈమె... ఈమె..." అని సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోతూ అన్నాడు.

అతను పెదవులపైన వేలుంచుకుని, మాట్లాడవద్దన్నట్టుగా సైగ చేశాడు. కప్పుల్ని టీపాయ్ పైన పెట్టేశాక ఆమె తిరిగి లోపలికెళ్లిపోయింది.

"నువ్వు మాయమైపోయిందని చెప్పిన మనిషిలాగే ఉంది కదా ఆవిడ కూడా?" అని ప్రశ్నించాడు సబ్ ఇన్‌స్పెక్టర్. నేనతడివైపుకు మెచ్చుకోలుగా చూడకుండా ఉండలేకపోయాను.

"అదేసార్ సమస్య... చూడ్డానికి ఈవిడ అంతా నా పెళ్లాం మాదిరే ఉంటుంది. కానీ కాదు..." అన్నాడతను దీనంగా.

"అంటే యింపర్సనేషనా? మనిషినే ఎవరైనా మార్చేశారంటావా?" సబ్ఇన్‌స్పెక్టర్ వ్యంగ్యంగా అడిగాడు.

అతనీసారి కళ్లు తుడుచుకుంటూ "అవున్సార్.. నా భార్య కాదీవిడ... అయితే చూడ్డానికి అలాగే అనిపిస్తుంది...." అన్నాడు

సబ్ ఇన్‌స్పెక్టర్ ఈసారి మనస్ఫూర్తిగా నోరంతా తెరిచి నవ్వి, కప్పు తీసుకుని రెండు చుక్కలు చప్పరించి, "మారిపోయిందనటానికి సాక్ష్యమేమిటి? తప్పిపోయిన మనిషి పోలికలేమిటి?" అని కంప్లయింటును తిరగతోడబోయాడు.

అతను నాకేసి తిరిగి రోషంతో రొప్పుతూ "నువ్వూ తాగి చూడు" అన్నాడు.

నేనోసారి కప్పును పెదవులకు తాకించి "ఇది టీ... నేను కాఫీ తప్ప ఇంకేమీ తాగను" అన్నాను.

సబ్ ఇన్‌స్పెక్టర్ పళ్లికిలించి "ఒక్కో ఇంట్లో ఒక్కో అలవాటుంటుంది... ఫార్ ఎగ్జాంపుల్, నేను ఇంట్లో హార్లిక్సే తాగుతాను" అన్నాడు.

"ఏమి తాగుతారన్నది కాదు సార్ ప్రశ్న. ఆ టీలో యే మార్పూ కనబడలేదా మీకు?" అని వాపోయాడతను. భోరుమని ఏడవబోయి, తమాయించుకుని "అందులో చక్కెర మామూలుగా వేయాల్సినంత వేయలేదు. చిటికెడు తక్కువుంది. నా భార్యయితే అలా చచ్చినా వేయదు. నిజం సార్.. ఇది నా పెళ్లాం కాదు... ఎవరో దాన్నెత్తుకు పోయి, దీన్నిక్కడ చేర్చేశారు" అన్నాడు.

"మీ డాక్టరేమైనా నీకు దయాబిటిస్ ఉందని కనిపెట్టి, అందువల్ల చక్కెర తక్కువగా వాడమని నీ పెళ్లాంతో..." సబ్ ఇన్‌స్పెక్టర్ గొణిగాడు.

"లేకపోతే ఆమెకే దయాబిటిస్ ఉందన్న అనుమానంతో చక్కెర తక్కువగా వాడమని డాక్టరెవరైనా..." నేనూ ఊహించసాగాను.

"లేదు... లేదు.. కాదు.. కాదు..." భరించలేనట్టుగా కెవ్వున కేకేశాడతను. లోపలి నుంచీ ఆవిడేమైనా తొంగి చూస్తుందేమోనని ఎదురుచూశాను. కాని లోపలి నుంచీ సవ్వడేమీ వినిపించలేదు.

"ఇదేమిటో కొత్తరకం కేసులాగుంది. సరైన సాక్ష్యం లేకపోతే నీ కంప్లయింటును తీసుకోలేను" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ సర్దుకుని కూర్చున్నాడు.

"సార్సార్, అలా చేతులెత్తేయకండి. నా కంప్లయింటులో తప్పులేదు. ఒకసారి జరిగుంటే నేను పట్టించుకొని ఉండను. గతవారం రోజులుగా ఇలాగే టీలో చక్కెర తక్కువ పడుతోంది... అంతే కాదు... అంతే కాదు..." బాధతో అతడి గొంతు బొంగురు పోతోంది. అతడి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. అంతవరకూ చెప్పడానికి సందేహించిన రహస్యమేదో అతను చెప్పబోతున్నాడని అర్థమయింది. సబ్ ఇన్‌స్పెక్టర్ ముందుకు వంగాడు. నేను కుందేలులా చెవులు రిక్కించాను.

"సార్సార్, ఇప్పుడింట్లో ఉన్న ఈ మనిషి వీపుపైన రెండు రెక్కలు మొలవబోతున్నట్టుగా నాకు అనుమానంగా ఉంది సార్.... నా పెండ్లాన్ని చూస్తే అలాంటి అనుమానం రానే రాదు" అంటూ గొల్లుమన్నాడతను.

25-9-2012 ఆదివారం ఆంధ్రజ్యోతి